

# వార్త

సింహప్రసాద్

**'క్షుద్బాధకి తాళలేక బిచ్చమెత్తిన యమ్మెల్యే తండ్రి!'**

**ఆ శీర్షికతో బాక్సు కట్టి మరీ ప్రచురించిన వార్త చూసి లక్షలాది మంది పాఠకులు విస్తుబోయారు.**

**ఇది నిజమేనా? అని సందేహించారు. అలాంటి సందేహ నివృత్తి కోసమేనన్నట్టు పక్కనే ఫోటో కూడా ప్రచురించారు. ఆ ఫోటోలో దీనంగా వున్న ఒక ముసలాయనకి ఓ 'పెద్ద మనిషి' వందరూపాయల నోటు ఇస్తున్నాడు.**

గబ గబా వార్తని చదివారు.

అధికార పార్టీకి చెందిన యమ్మెల్యే నాయుడు తన నియోజక వర్గాన్నే కాదు తన వాళ్ళనీ పట్టించుకోవట్లేదట. అన్నీ అందర్నీ వదిలేసి రాజధానిలో స్థిరపడిపోయారట. అతడి అశ్రద్ధకి బలైనవారిలో అతడి తండ్రి బుచ్చయ్య కూడా వున్నారట. కన్న కొడుకు ఆదరించక పోయేసరికి మరి గత్యంతరం లేక స్థానిక ప్రతిపక్ష నాయకుడైన వాసూరావుని ప్రాధేయపడ్డారట. ఆయన బుచ్చయ్యగారి దుస్థితికి జాలిపడి ఆర్థిక సహాయం చేశారట. ఆ సందర్భంగా 'నాయుడి లాంటి కొడుకు పగవారిక్కూడా వుండకూడదు' అని బాధ పడ్డారని వాసూరావు చెప్పేరట.

అదీ వార్త సారాంశం!

మరీ ఇంత దారుణమా! అనుకున్నారు జనం. 'ఔరా కలికాల మహిమ!' అని ముక్కు మీద వేలేసుకున్నారు కొందరు. నాయుడిని తిట్టి పోశారు మరి కొందరు. వాసూరావుని, వార్త ప్రచురించిన పత్రికవారినీ అభినందనల్తో ముంచెత్తారు మరికొందరు. నాయుడ్ని భలే దెబ్బ కొట్టారని చంకలు గుద్దుకున్నారు ఇంకొందరు!

యమ్మెల్యే నాయుడి అనుచరుడొకడు పేపరు తీసుకొని హుటాహుటిన యమ్మెల్యేగారింటికి వెళ్ళేడు. అప్పుడే నిద్రలేచాడాయన. రాత్రి మత్తు తాలూకా హేంగోవర్నించింకా పూర్తిగా బయట పడలేదు.

" అయ్యా! కొంపకొల్లేరైపోయింది!" వస్తూనే అన్నాడు అనుచరుడు.

" ఎవరి కొంపరా" తాపీగా అన్నారు యమ్మెల్యే బద్ధకంగా ఆవులిస్తూ.

"ఎవరి కొంపలయితే నాకీ దురదెందుకండీ. సాక్షాత్తూ మన కొంపే. మన పరువు గంగలో కలిపెయ్యడానికి పత్రికల వాళ్ళు కంకణం కట్టుకున్నట్టున్నారండీ. మెయిన్ ఎడిషన్ మొదటి పేజీలో వేశారు మీరే చూడండి. ఈ పాటికి రాష్ట్రవ్యాప్తమంతా తెలిసిపోయే వుంటుంది" అన్నాడు పేపరందిస్తూ.

అన్ని రకాల మత్తులూ మంత్రించినట్టు మాయం కాగా ఆత్రంగా పేపరు అందుకొని చూశారు. చదివారు. గుండెలు గుభిల్లుమన్నాయి. మొహంలోని రక్తమంతా ఎవరో తోడేసినట్టు ఇంకిపోయింది!

" నాకు వ్యతిరేకంగా ఇంతటి ఘోర వార్త రాస్తారా?! ఆ పత్రిక వాళ్ళకి నేనెన్ని చేశానూ ఎన్ని ప్రకటనలిప్పించానూ!....

" పత్రికల వాళ్ళతో వచ్చిన చిక్కే ఇదండి. అందర్తో పూసుకు తిరుగుతారు. కాని ఎవరు చేసిన మేలూ గుర్తుంచుకోరు. సర్క్యులేషన్ పెంచుకోవడమన్న ఒక్క అంశమూ తప్ప వాళ్ళకి మరేమీ పట్టవు. గుర్తుండవు"

" ఊహు. ఇది వాళ్లంతట వాళ్లు చేసిన పనికాదు. మన పార్టీ వాళ్ళే ఎవరో పనిగట్టుకుని వేయించి వుంటారు. రేపోమాపో మంత్రివర్గ విస్తరణలో నాకు స్థానం లభించవచ్చని బలంగా వార్తలొస్తున్నాయి కదా. నా అవకాశాలకి గండికొట్టడానికి ఎవరో పన్నిన కుట్ర ఇది. వారెవరై వుంటారు?" మొహం కఠినంగా మారుతోంటే ప్రశ్నించారు యమ్మెల్యే.

"మన వాళ్ళే అయితే ప్రతి పక్షానికి చెందిన వాసూరావుతో ఎందుకు చేతులు కలుపుతారు?"

"రాజకీయమంటే అదేరా. ఒక్క దెబ్బకి రెండు పిట్టలు. స్థానికంగా వాసూరావుకి పలుకుబడి పెరుగుతుంది. ఇక్కడేమో మంత్రి పదవికి జరుగుతున్న పోటీలో నా అడ్డంకి తొలుగుతుంది!"

" అయితే ఎన్నాళ్ళనుంచో వూరిస్తున్న మంత్రి పదవి కాస్తా చేతికి చిక్కకుండానే...."

"అలా ఎలా జరగనిస్తాను? ప్రతి వ్యూహం రచించి చావు దెబ్బ కొట్టనూ. ముందు ముఖ్య మంత్రినీ పార్టీ ప్రముఖుల్ని కలవాలి. అపార్థం చేసుకోవద్దని నచ్చచెప్పాలి...."

ఆయన ధోరణికి అక్కడే వున్న మరో అనుచరుడు విస్తుబోయి అపనమ్మకంగా చూశాడు. కన్నతండ్రి అంతటి దయనీయ స్థితిలో వున్నాడని మాట వరసకి కూడా బాధపడడేమిటనుకున్నాడు. "అసలిలాటి పరిస్థితి రాకుంధా ముందునుంచే ముసలాయన్ని జాగ్రత్తగా చూసుకునుంటే బాగుండేది" అనాలనుకున్నాడు. కాని అన్లేదు. కోపం రావొచ్చని సందేహించాడు. ఆ వార్త వెనుక తన హస్తం వుందనెక్కడ ఆడిపోసి తరిమేస్తాడోనని భయపడ్డాడు!

హడావిడిగా తయారై ముఖ్యులందరిళ్ళకీ వెళ్ళారు నాయుడు.

కొందరా వార్తని అంతకు ముందే విన్నారు. కొందరి దృష్టికసలు రానేలేదు కూడా. అయినప్పటికీ అంతా పూసగుచ్చినట్టు వివరించాడు నాయుడు. ఆ వార్తలో ఆవగింజంత సత్యం లేదన్నారు. " నాకు బోలుడు ఆస్తిపాస్తులున్నాయి. కన్న తండ్రికో ముద్ద పెట్టలేనా?" అని ఎదురు ప్రశ్నించారు. ఆ వార్త వెనుక వున్న కుట్రదారులెవరై వుంటారో ఆ పని ఎందుకు చేసి వుంటారో తన అనుమానాల్ని వెళ్ళ

గ్రక్కారు.

"ఏమైనా ఈ న్యూస్ వల్ల నీకూ తద్వారా మన పార్టీకి అప్రతిష్ఠ వచ్చింది. ఎలాగైనా దాన్ని తొలిగించేలా చూడు. ఇంకెప్పుడూ ఇలాటివి రాకుండా చూడు" ముఖ్యమంత్రి సలహా ఇచ్చారు.

"తప్పకుండాన్సార్. మరి నా మంత్రి పదవి సంగతి..."

"ముందా గొడవ నుంచి బయట పడు..." మరొక్క మాటకి అవకాశం ఇవ్వలేదాయన.

హతాశుడయ్యాడు నాయుడు. ఆ వెంటనే పత్రికలో వచ్చిన వార్త మీద అందుకు కారకుడైన తండ్రి మీద పీకల దాకా కోపం వచ్చింది. ఎనభై ఏళ్ళు పైబడిన ఆయనింకా బతికి ఏం ఉద్ధరించాలి గనుక! ఏ జబ్బు చేసినప్పుడో టపా కట్టేసి వుంటే నాకీ పీడ దాపురించేది కాదు" అని విసుక్కున్నాడు.

" ఆ విలేకర్నీ వదలకూడదు. నా నియోజక వర్గం వాడు నాకు వ్యతిరేకంగా అలాటి వార్త రాస్తాడా? బతికి బట్టకడదామనే?!" అని పళ్లు నూరారు.

" ఇప్పుడేవిటి చెయ్యటం?" అనుచరుడడిగాడు.

" వెంటనే మన వాళ్ళందరికీ ఫోన్లు చేసెయ్. రేపు ఉదయానికల్లా అక్కడికొచ్చేస్తానని చెప్పు. అన్ని పత్రికల వాళ్ళనీ పిలవమను. మనింట్లోనే ప్రెస్‌మీట్ పెడదాం. మా నాన్న చేత ఖండన ప్రకటన ఇప్పిద్దాం. అన్నట్టు పత్రికల వాళ్ళని కాస్త ఆకట్టుకోవాలి. భారీగా విందు ఏర్పాట్లు చెయ్యమను. అందర్నీ మనూరు తీసుకురావడానికీ తీసుకువెళ్ళడానికీ టాక్సీలు అరేంజ్ చెయ్యమను. వాళ్ళని బాగా చూసుకోవడం చాలా ముఖ్యం..."

మర్నాటి ఉదయం పల్లెలోని తన ఇంటికి నాయుడు వెళ్ళేసరికి ఇంటి ముందంతా జనంతో వాహనాల్తో నిండి వుంది. కుర్చీలు, షామియానాలు ఏర్పాటయ్యాయి. మరో పక్క వంటలు ఘుమఘుమలాడిస్తూ చకచకా చేసేస్తున్నారు.

యమ్మెల్యేను చూస్తూనే అనుచర గణం ఎదురొచ్చింది. అలవాటు ప్రకారం జైజైలు కొట్టారు. పిమ్మట వార్త వేసిన వాడ్నీ రాసినవాడ్నీ వాసూరావునీ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు. వాళ్ళని అది చేస్తాం, ఇది చేస్తాం అని బీరాలు పలికారు. నాయుడేమీ బదులివ్వలేదు. తిన్నగా ఇంట్లోకి నడిచాడు.

లంకంత పాత లోగిలది. తండ్రి తప్ప అంతా ఎప్పుడో సిటీకెళ్ళిపోయారు. ఒక రకంగా అక్కడ స్థిరపడిపోయారు. శుద్ధ పల్లెటూరి వాడూ రోగిష్ఠి అయిన తండ్రిని తన కూడా తీసుకెళ్ళడం ఇష్టం లేకపోయింది నాయుడికి. పైగా ఆయనకి తన పద్ధతులు నచ్చవు. ఆయన ధోరణి తమకి నచ్చదు. అందుకే పల్లెలోనే వుంచేశారు. మొదట్లో వ్యవసాయం చూసేవారు. కాని తను పొలాన్ని అమ్మేసి సిటీలో ఓ పరిశ్రమలో వాటా తీసుకోవడంతో పల్లెలో ఆస్తులేం మిగల్లేదు. పదిమంది కళ్ళల్లో పడటం ఇష్టం లేక ఇక్కడ మరేమీ కొనలేదు కూడా. పని మనిషి వండిపెడు



తోంటే తండ్రి ఒక్కడూ ఇంటిని అంటిపెట్టుకునుండి కాలక్షేపం చేస్తున్నాడు.

మూల వసారాలో కుక్కి మంచం మీద మునగ తీసుకుని నీరసంగా పడుకునున్నారు బుచ్చయ్య.

"నీకిది బావుందా ? ఒంటి మీదికి ఏళ్ళు వస్తే సరికాదు బుద్ధి కూడా పెరగాలి" వురుములేని పిడుగులా పడ్డాడు తండ్రిమీద.

"ఏవైందిరా అబ్బాయ్. ఎప్పుడొచ్చేవురా..."

బయటంత హడావిడి చేస్తున్నా ఆయనకేమీ తెలీలేదంటే ఆయన్నెవరూ పట్టించుకోవట్లేదన్న వూహ అతడికి రాలేదు.

నవ్వు చేసిన నిర్వాకానికి రాక ఏం చేస్తాను? నవ్వు చేసి పిచ్చి పనికి మంత్రి పదవి చేతిలోకి రాకుండానే చేజారే పరిస్థితి వచ్చి పడింది!"

" నేనేం చేశాన్రా అబ్బాయ్. అక్కడికీ ఇక్కడికీ తిరిగే ఓపికకూడా లేక ఇంట్లోనే ముడుచుకు పడుకుంటున్నాను..."

" చేసిందంతా చేసి నంగనాచి కబుర్లొకటి! అసలు ఆ వాసూరావుగాడింటికెందుకెళ్ళావ్? దేహి అని ఎందుకర్థించావ్? వుంటే తినాలి. లేకపోతే పస్తుండాలి. అంతేగాని- ఛీ! అడుక్కుతింటావా? నీ కొడుకు గొప్ప నాయకుడు యమ్మెల్యే మాత్రమే కాదు కాబోయే మంత్రి అన్న సంగతి మరచి ప్రతిపక్షం ముందు చెయ్యి చాస్తావా? అసల్నీకిప్పుడు లోటేమొచ్చింది. నాల్రోజులు తిండి లేకపోతే ఛస్తావా?"

నివ్వెరపోయి చూశారు బుచ్చయ్య. ఆయన లోతు కళ్ళల్లో కన్నీటి పొర కదిలింది. సన్నగా కంపించారు. కొడుకు వంక అయోమయంగా చూశారు. " ఏ

పితృదేవోభవ అని భావించి పూజించే తనని తండ్రి అతీగతీ పట్టించుకోని వాడిగా ముద్ర వేసినందుకు బాధపడ్డారు. కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. తన తండ్రి ఆకలితో అల్లాడుతున్నాడనీ అడుక్కుతింటున్నాడనీ విష ప్రచారం చేస్తున్నందుకు తామిద్దరూ బాధతో కుళ్లి పోతున్నామన్నారు.

వంటున్నావో అర్థం కావట్లేదురా..."

" ఆ వాసూరావు దగ్గరికెళ్లి చెయ్యి చాపాల్సిన ఖర్మేం పట్టిందంటున్నాను" అరుస్తున్నట్టుగా అన్నాడు.

"మావోడు డబ్బు పంపలేదు. ఇబ్బందిగా వుంది. చేబదులిమ్మన్నాను. మూడ్రోజులు తిప్పించుకుని ఇచ్చాడు"

"చేబదులిప్పించుకున్నావా?"

"అవున్రా"

" దాన్ని ఆ త్రాష్ఠుడు ఏవని చిత్రించాడో తెలుసా? నీకు డబ్బులివ్వడం ఫోటో తీసి అడుక్కుంటున్నానవని పేపర్లో రాయించాడు. రాష్ట్రమంతటా ఈ సంగతే చెప్పుకుంటున్నారు. నవ్వు చేసిన తెలివితక్కువ పనికి ఎంత అప్రతిష్ఠ చుట్టుకుందో చూడు"

"ఛ్ఛొచ్ఛో- అంత మోసం చేస్తాడ్రా ఆ పెద్ద మనిషి. ఇంట్లో ఏవీ లేవనెళ్ళానుగాని ఇలా జరుగుద్దనుకోలేదు. నీ దగ్గర్నుంచి డబ్బు రావట్లేదు. ఇంట్లో సరుకులన్నీ నిండుకున్నాయి వాళ్ళనీ వీళ్ళనీ అడిగి బజార్లో అరువు తీసుకొని ఎలాగో లాక్కొస్తున్నాను. చెంబూ తపేలా అమ్మడం ఇష్టం లేక నాల్రోజుల్నుంచి పస్తులున్నాను. అయినవాడు కదాని వాసూరావు దగ్గర చేబదులు తీసుకుంటే అది కాస్తా కొట్టోడు అప్పుకి జమేసుకున్నాడు. పాత బాకీ పూర్తిగా చెల్లిస్తేగాని అరువు ఇవ్వనని కూర్చున్నాడు. మరి దిక్కుతోచక ఇలా పడుకున్నాను"

"నీకు అరువు ఇవ్వనన్నాడా? ఎవడా లమ్డి కొడుకు?"

"ఎవడైతే ఏం లేరా. వాడి తప్పేముంది పాపం. పాపం పెరిగినట్టు బాకీ పెరిగిపోతుందాయె"

"అయితే మాత్రం యమ్మెల్యే తండ్రివని కూడా చూడకుండా అంత నిర్మోహమాటంగా మాట్లాడతాడా? వాడి సంగతి చూస్తాన్లేగాని ఇంకాసేపట్లో పత్రికల వాళ్ళొస్తారు. వాళ్ళతో నేన్నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నానని చెప్పాలి. నీకెలాంటి లోటు చెయ్యట్లేదనీ పుట్టిన వూరునీ లంకంత కొంపనీ వదల్లేక వంటరిగా వుంటున్నానని చెప్పాలి. తెల్సిందా? వాసూరావు నీకు బాకీ వున్నాడనీ అది వసూలు చేసుకోడానికెళ్లానని చెప్పు...."

"బాగోదేమోరా. చేబదులు పుచ్చుకున్నానని చెప్పేస్తాను"

"వద్దొద్దు. అలా చెప్పినా నేన్నిన్ను సరిగ్గా చూడటం లేదనే అనుకుంటారు. నా పరువు గంగలో కలిసిపోద్ది. నీ కొడుకు నలుగుర్లో నవ్వులపాలవడం నీకిష్టమా నాన్నా"

"అదికాదురా అబ్బాయ్..."

"ఇంకేం చెప్పొద్దు గాని మంచి చొక్కా తొడుక్కుని రెడీ అవ్వు. వాళ్ళొచ్చేస్తారు. మంగలికి కబురు పంపిస్తాను గెడ్డం గీయించుకో. ఎంతో సుఖంగా, సంతోషంగా వున్నట్టు కన్పించాలి"

తలాడించాడు.

మూడ్రోజుల్నించి అస్సలేమీ తినలేదు. ఎంతో నిస్సత్తువుగా వుంది. ఒళ్ళు తూలేలా వుంది. అయినా కొడుక్కోసం నటించడానికే నిర్ణయించుకున్నారు. లేని శక్తిని కూడదీసుకున్నారు. మంగలి చేత గెడ్డం గీయించుకున్నారు. స్నానం చేశారు. చలువ చేసిన సిల్క్ చొక్కా తొడుక్కున్నారు.

( మిగతా 25వ పేజీలో)

( 9వ పేజీ తరువాయి )

## ఈ వారం కథ

ఆయన్ని చూసి నాయుడూ ఆయన అనుచరులూ కూడా ఆనందంతో పొంగిపోయారు.

"ఇప్పుడు కాబోయే మంత్రిగారి తండ్రిలా వున్నారు" మెచ్చుకుంది అనుచరగణం. పేలవంగా నవ్వేరాయన.

రెండు కార్లలో పత్రికల వాళ్ళొచ్చారు.

అందర్నీ సాదరంగా ఆహ్వానించారు నాయుడు. అందరి మంచి చెడ్డలు కనుక్కున్నారు. నియోజక అభివృద్ధి కోసం తను చేబట్టదలచిన కార్యక్రమాలు ఏకరువు పెట్టారు. మంత్రి వర్గంలో సీటు లభించడం ఖాయం అని అంతా అంటున్నారు మరి అని నవ్వేరు.

తన పరువు ప్రతిష్టల్ని మంటగలపడానికి కొందరు కంకణం కట్టుకున్నారనీ కట్టు కథల్తో మాయమాటల్తో మసిపూసి మారేడు కాయ చేస్తున్నారనీ చెప్పేరు. అందుకు తాజా ఉదాహరణ క్రితం రోజున ఓ పత్రికలో వచ్చిన వార్తేనన్నారు.

[illegible]దేవోభవ అని భావించి పూజించే తనని తండ్రి అతీగతీ పట్టించుకోని వాడిగా ముద్ర వేసినందుకు బాధపడ్డారు. కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు. తన తండ్రి ఆకలితో అల్లాడుతున్నాడనీ అడుక్కుతింటున్నాడనీ విష ప్రచారం చేస్తున్నందుకు తామిద్దరూ బాధతో కుళ్లి పోతున్నామన్నారు. నిజానిజాలేమిటో మీరే ప్రత్యక్షంగా తెలుసుకుంటారనీ వాస్తవాలని ప్రజలకి తెలియజేయాల్సిన గురుతరమైన బాధ్యతని సక్రమంగా నిర్వర్తిస్తారనీ పత్రికా సమావేశం ఏర్పాటు చేశానన్నారు.

విలేకరులంతా బుచ్చయ్య మీద ప్రశ్నల వర్షం కురిపించారు. వాసూరావు డబ్బివ్వడం గురించీ ఫోటో గురించీ ఎన్నెన్నో అడిగారు. అన్నిటికీ ఎంతో ఒపిగ్గా కొడుకు చెప్పినట్టుగానే అందంగా అతికేట్లుగా జవాబిచ్చారు.

"మీ అబ్బాయి మీ మీద చూపుతున్న ప్రేమాభిమానాలకి మీరు పూర్తిగా సంతుష్టులవుతున్నారా?" ఒక విలేకరి ప్రశ్నించారు.

గొంతులో ఏదో అడ్డుపడింది. నోట్లోంచి మాట రాలేదు. తలవూపుడుతో అవునని సమాధానమిచ్చారు.

"మా యెమ్మెల్యేగారు బుచ్చయ్యగార్ని నెత్తినెట్టుకొని ప[illegible]స్తారండీ. ఆయన్నేవైనా ఆడిపోసుకుంటే కళ్ళుపోతాయి. అంత గొప్పోరు. బోల్డు ఆస్తిపాస్తులున్న ఆయనకి డబ్బులోటేంటి చెప్పండి" అంటూ అనుచర వర్గం విజృంభించింది.

అనంతరం పత్రికా ప్రతినిధులకి విందు చేశారు నాయుడు.

మూడు రకాల స్వీట్సుతో చికెన్ బిర్యానీతో ప్రత్యేక భోజనం వడ్డించారు.

తండ్రిపక్కనే కూర్చుని యమ్మెల్యే నాయుడు "తినండి నాన్నగారూ" అంటూ కొసరి కొసరి వడ్డించారు. బలవంతాన స్వీట్సు తినిపించారు.

ఆ దృశ్యాన్ని కెమెరాల్లో బంధించారు విలేకర్లు.

నకనకలాడుతున్న పేగుల్లోకి స్వీట్సూ బిర్యానీ జారి అక్కడ ఇమడలేక పోయాయి. ఏదో తెలీని వెగటుదనం వూపెయ్యగా కడుపులో తిప్పగా పెద్దగా వాంతి చేసుకున్నారు బుచ్చయ్య. ఆ వెంటనే రక్త వాంతి చేసుకుని మూలబడిపోయారు.


మరి లేవలేదాయన.

"అభాండ వార్తకి వేదనతో కుమిలి కుమిలి ప్రాణాలొదిన అభాగ్య తండ్రి" అనే హెడ్డింగ్‌తో వార్త వచ్చింది ఆ మర్నాటి అన్ని పత్రికల్లోనూ!

( 13వ పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులతో కూడిన చట్టసభల ఏర్పాటు మాత్రమే ప్రజాస్వామ్యపు సారాంశం కాదు. ప్రజాస్వామ్యమంటే మానవసంబంధాలు, వ్యవహారాలకు సంబంధించిన నాగరిక నిర్వహణ. సంయమనం, సదవగాహన, ఎదుటి పక్షపు అభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశాన్ని ఇవ్వడం వంటి నాగరిక లక్షణాల ప్రజాతంత్రరాజ్యం. ఇవన్నీ ఆ రాజ్యమనుగడకు మూలాధారాలు కూడా. భారత ప్రజానీకం ప్రజాస్వామ్య వ్యవస్థకే స్పష్టమైన ప్రాధాన్యతనిచ్చారు. అయితే పరస్పర కలహాలు, అవకాశవాదాలు, అధికార వ్యామోహాలతో ఎన్నికల ప్రక్రియను అభాసుపాలు చేస్తే ప్రజానీకానికి ప్రజాస్వామ్యంపై దురభిప్రాయం ఏర్పడుతుంది. అప్పుడు వారు మరో ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటారనే విషయాన్ని అన్ని రాజకీయపార్టీలు గుర్తించాలి.

**ఎన్నికల కురుక్షేత్రంలో ఓటరు కృష్ణ 'గీత'**



వాజ్‌పేయి: కాబోయే ప్రధాన మంత్రి కల నిజమాయేనా?!

ముంచుకొస్తున్న 12వ లోక్‌సభ ఎన్నికల ముహూర్తవేళ.

ఓటరు తనదైన రీతిలో కృష్ణగీత వినిపించేందుకు సర్వసన్నద్ధంగా వున్నాడా? ఈ ప్రశ్నకు సరైన జవాబు రాబట్టడం చాలా కష్టమే! ఈసురోమని దేశగతి వుంటే ఓటరు గమనంలో ఎలా చైతన్యాన్ని ఆశించగలం. చాలా మటుకు నిరాశ, నిస్పృహలు వెంటరాగా అతను పోలింగ్ బూతును చేరుకుంటాడు. ఓటును వేస్తాడు. ఎవరికి? ఈ ప్రశ్నే ఎప్పటికప్పుడు...ఫలితాలు వెలువడేంత వరకు ప్రశ్నగానే మిగల్చటం మన యాభైఏళ్ల స్వర్ణభారతిలో మిగిలిన ఏకైక మంచి లక్షణం. అదే 'ఓటరు బలం'.

పార్టీలన్నీ మధ్యంతర ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. కొత్త కొత్త పొత్తులకు మార్గాన్వేషణ చేస్తున్నాయి. బిజెపి బలంగా వున్న చోట కాంగ్రెస్‌కు మద్దతు పలకడంలో తప్పులేదంటున్నాడు ఫ్రంటుభాగస్వామి ములాయం సింగ్ యాదవ్. బిజెపి బలంగా లేని చోట ప్రత్యర్ధి కాంగ్రెసే అని కూడా అంటున్నాడు. దీని భావమేమి ఓటరేశ?

మూపనార్ తమనుంచి జారిపోకుండా కాపాడుకోవాలని ఫ్రంటు 'పని'చేస్తోంది. అదే సమయంలో తన ఒరలో మరో కత్తి డిఎంకెను వుంచుకోవాలనీ చూస్తోంది. ఆంధ్రరాష్ట్రంలోను, తమిళనాడులోను అధికారపార్టీలపై కఠిన విమర్శలు చేయకుండా, కాంగ్రెస్‌నే ఎన్నికల సభల్లో ఉతికి ఆరేయాలని బిజెపి 'లోగుట్టు' గా ఒట్టేసుకుందట!

**కవర్ పేజీ కథనం**

పశ్చిమబెంగాల్‌లో 'తృణమూల్' మమతా బెనర్జీ జ్యోతిబసు ప్రభుత్వంపై, ఆయన పార్టీపై నిప్పులు చెరుగుతోంది. తన మాతృసంస్థ కాంగ్రెస్‌ను కాదనైనా సరే జ్యోతిబసును ఢీకొట్టాలన్నది ఆమె నిశ్చితాభిప్రాయం. అందుకు ఆమె తనవైన లెక్కల సమీకరణాలు వేసింది. సమీకరణాలు సరితూగడానికి అవసరమైతే బిజెపి సాయం తీసుకుంటాననంటోంది. బిజెపిని మతతత్వ పార్టీగా విమర్శించటం బుద్ధిహీనతగా ఆమె గుర్తించింది. ఈ కాంగ్రెస్ మానసపుత్రిక ఇలా గర్జిస్తోంది.

"ఎవరు మిత్రులు, ఎవరు శత్రువులు. ఎవరే పార్టీ. ఓటరు కృష్ణా...నాటి కురుక్షేత్ర కృష్ణుడంత ఈజీనా నీపని?! కాదు సుమా! నువ్వే ఓ కృష్ణుడివి, నువ్వే ఓ దిగాలు పడ్డ అర్జునుడివి. కర్త, కర్మ, క్రియ నువ్వే. నీకు కర్మఫలాపేక్ష అవసరమా? యాభై ఏళ్లపాటు నీ బాగోగులు ఎలా చూశారో, అలాగే ఇకముందుకూడా కావచ్చు కదా?!" మళ్లీ వచ్చిపడ్డ ఈ ఎన్నికల వేళ ఓ తెలుగుపండితుడు పడ్డ ఆవేదనిది.

ఈ ఎన్నికల్లో దాదాపు అన్ని పార్టీలు బిజెపిని వ్యతిరేకించేవే. మళ్లీ వీటికి కాంగ్రెస్ ఎడం. కాంగ్రెస్ వ్యతిరేకతతోను, బిజెపి మతతత్వవాదపార్టీ అన్న విమర్శతోను ఓట్లను రాబట్టుకోగలమన్నది ఫ్రంటుపార్టీల ఆశాభావం. పశ్చిమభారతంలోను, మధ్యభారతంలోను వున్న పంజాబ్, హర్యానా, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో ఫ్రంట్ కొత్తగొంతును వినిపించాల్సిందే. ఈ మొత్తం ప్రాంతంలో బిజెపితో పోరాడగల ఏకైక సెక్యులర్‌పార్టీ కాంగ్రెస్ మాత్రమే. పంజాబ్, మధ్యప్రదేశ్‌లో బిఎస్‌పి కొంతమేర బిజెపిని నిలవరించగలదు. ఇలా చెప్పుకుంటూ పోతే మళ్లీ సంకీర్ణధ్వని స్పష్టంగా వినిపిస్తూంది.

ఇప్పుడు ఓటరు ముందు వున్నది ఒక 'ట్రయాంగిల్' పార్టీల రూపం. ఈ ముక్కోణంలో అతను ఎవరిని బయటకు లాగుతాడో? లేక మళ్లీ గతాన్ని పునరావృతం చేసి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణ్‌ను లెక్కల చిక్కుల్లోకి నెట్టుతాడో? ఈ ప్రశ్నలకు జవాబు రాబోయే కొత్త సంవత్సరం మొదటిభాగంలో....

-వై.కాశీపతి, కె.వి.రామిరెడ్డి